ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## పంచమాధ్యాయము

### సూతముని ఋషులకు పరాశక్తియొక్క అవతార గాధలను చెప్పుట :-

సూతమౌని వలన పరాశక్తి మహత్యమును వినిన శౌనకాది మహర్షులకు ఆ శ్రీదేవీ మహత్యమును గూర్చియింకను వినవలెనను కుతూహలము మిక్కుటముగ కలిగెను. వారు సూత మహర్షితో “ఓ మహర్షీ! సర్వమునకు మూలాధారమైన ఆ పరాశక్తి ఎప్పుడెప్పుడు ఏయే రూపములతో దుష్టులను సంహరించి, ధర్మప్రతిష్ఠాపనము గావించినదో తెలుసుకొనవలెనని మిక్కిలి అతురతతో నున్నాము. ఆదేవి మహిషాసురుడు, చండముండాసురులు మొదలైన వారిని హతమార్చి, లోకములను రక్షించినదని వినియుంటిమి. ఆ మహత్తరగాధలను మాకు తెలియజేసి మమ్ములను కృతార్థులు గావించవలసినదిగా ప్రార్థించుచున్నాము.” అని అభ్యర్థించిరి. సూతమహర్షి ఇట్లడుగ బడినవాడై మిక్కిలి సంతోషించి యీరీతి చెప్పసాగెను.

ఓ మౌనిసత్తములారా! “పూర్వము దేవదానవులకు నూరేండ్లు యుద్ధము జరిగెను. రాక్షసులకు మహిషుడును, దేవతలకు ఇంద్రుడును నాయకులుగ నుండిరి. మహావీరులగు రాక్షసులచే దేవతలు పరాజితులైరి. దేవతలందరిని జయించి మహిసాసురుడు ఇంద్రపదవి నధిష్ఠించెను. మహిషాసురుని అత్యాచారములకు లోకములు భయపడి గడగడలాడసాగినవి. ఋషులు, దేవతలు దీనాతిదీనులై బ్రహ్మ విష్ణు మహేశ్వరుల సన్నిధికేగి మహిషాసురుని దుండగములను గురించియు, లోకము

యొక్క దీనస్థితిని గూర్చియు విన్నవించుకొని శరణుజొచ్చిరి. ఎట్లైన ఆ దుష్టరాక్షసుని సంహరించు మార్గమాలోచింపుడని త్రిమూర్తులను మరిమరి ప్రార్థించిరి.

## విజయదుర్గావిర్భావము - మహిషాసుర మర్దనము :-

మహిషుని దుండగములను విన్న బ్రహ్మ విష్ణు మహేశ్వరులు రక్కసునిపై కోపముతో మండిపడిరి. త్రిమూర్తుల గంభీరవదనముల నుండి గొప్పతేజస్సులు వెలువడినవి. తోడనే యింద్రాది దేవతల శరీరములనుండి కూడ అట్టి మహాతేజములే బయల్పడినవి. క్షణములో ఆ దివ్య తేజస్సులన్నియు ఏకమైనవి. దిగంతములనంటు మంటలతో మహాపర్వతము వలె రూపొందిన ఆ తేజోరాశిని దేవతలు తిలకించిరి. అంతలో ముల్లోకములను ఆక్రమించు కాంతితో వెలుగు ఆ మహాతేజస్సు ఒక స్త్రీమూర్తిగ మారిపోయినది. శంభు సంబంధమైన తేజము ఆమెకు ముఖముగ రూపొందినది. యముని తేజము ఆమెకేశములైనవి. విష్ణు తేజము ఆమె బాహువులుగ మారినది. చంద్రుని తేజము ఆమె కుచద్వయమైనది. ఇంద్రుని తేజము ఆమె నడుముగను, భూమి తేజము ఆమె పిరుదులుగను, వరుణతేజము ఆమె ఊరువులు మరియు పిక్కలుగను రూపొందినవి. బ్రహ్మతేజస్సుచే ఆమె పాదములు, సూర్యతేజముతో ఆదేవి కాలివ్రేళ్ళు, వసువుల తేజముతో ఆమె చేతి వ్రేళ్ళు యేర్పడినవి. కుబేర తేజము ఆమె నాసికగను, ప్రజాపతి తేజము దంతములుగను, అగ్నితేజము ఆ తల్లికి మూడుకన్నులుగను, ఉభయసంధ్యల తేజము ఆమె కనుబొమలుగను, వాయుతేజము ఆ దేవికి చెవులుగను రూపుదాల్చినవి. తక్కిన యితర దేవతలందరి తేజస్సులతో కూడి ఆ అద్భుత శుభమూర్తి పూర్తి రూపమును ధరించినది. సర్వదేవతల తేజోరాశియై సముద్భవించిన ఆ అపూర్వశక్తిని గాంచి, సర్వులును సంతసించిరి.

శివుడు తన త్రిశూలము నుండి శూలమును, విష్ణువు తన చక్రము నుండి చక్రమును వెలయించి ఆమెకిచ్చిరి. బ్రహ్మ తన అక్షమాలాకమండలములను ఆ అద్భుతదేవతకర్పించెను. వరుణుడు శంఖమును, అగ్ని శక్త్యాయుధమును, వాయువు ధనుర్బాణములను ఆయమ్మకు సమర్పించిరి. ఇంద్రుడు వజ్రాయుధమును, ఐరావతపు మెడగంటను ఆ దేవికిడినాడు. యముడు కాలదండమును నింపెను. కాలుడాదేవికి డాలు కత్తులనిచ్చెను. క్షీరసముద్రముడు ముత్యాలసరములను, నూతన వస్త్రములను, సమస్తావయవములకు అనువైన కాంచన రత్నాభరణములను సమర్పించెను. విశ్వకర్మ పలువిధముల అస్త్రముల నిడి, అభేద్య కవచమునొసగెను. హిమవంతుడు వాహనముకై సింహమును, కుబేరుడు అక్షయపానపాత్రను, ఆదిశేషుడు నాగహారములను ఆ దేవికి సమర్పించిరి. ఆమె సింహవాహినియై మహాట్టహాసము గావించినది. ఆ భయంకరారవముతో అనంతాకాశము ప్రతిధ్వనించినది. సముద్రములు కంపించినవి. భూమి గడగడ వణికినది. పర్వతములు చలించినవి. దేవతలు ఆనందముతో జయజయధ్వానములుగావించిరి. ఋషులు వేదవచనములతో ఆమెను సంస్తుతించిరి. ఆ త్రిలోక సంక్షోభమును పరికించి, మహిషుడు సైన్యసమేతుడై అటువైపునకు పరుగెత్తెను. సహస్రబాహువులతో, సమస్త శస్త్రాస్త్రములతో అంతటను వ్యాపించి వున్న దేవిని తిలకించెను.

సింహవాహినీదేవికిని, మహిషాసురుని సైనిలకు మధ్య పోరు ప్రారంభమైనది. కోట్ల సంఖ్యలోగల రథగజతురగపదాతి రాక్షసదళములు దేవినెదుర్కొన్నవి. క్రోధారుణనేత్రయైనదేవి విడిచిన ఊర్పుల నుండి అసంఖ్యాకములైన సైన్యగణము లుద్భవించినవి. దేవివాహనమైన సింహము జూలువిదల్చి, అరణ్యములో పడిన కార్చిచ్చువలె రాక్షససైనమును అంతమొందించినది. అది చూచిన మహిషుని సేనాధిపతియైన చిక్షురుడను రాక్షసుడు శూలహస్తుడై దేవిపైకిరాగా, ఆమె భద్రకాళియై

తన శూలముతో ఆ రక్కసుని ముక్కలుగా నరికివేసినది. అది చూచిన చామరుడను రాక్షసుడు ఏనుగునెక్కి దేవినెదుర్కొనెను. వెంటనే దేవి వాహనమైన సింహము మహావేగముతో పైకెగిరి, ఆ ఏనుగుయొక్క కుంభస్థలమును చీల్చి చామరాసురుని చంపివేసినది. ఆ యుద్ధములో ఉదగ్రుని శిలలతోను, కరాళుని పిడికిటిపోట్లతోను, ఉద్ధతుని గదతోను, భాష్కలుని గుదియతోను, తామ్రాసురుని, అంధకుని తీవ్రబాణములతోను, ఉగ్రాస్యుడు, ఉగ్రవీరుడను రాక్షసులను తన త్రిశూలముతోను త్రినేత్రయైన పరాంబిక సంహరించినది. తన సైన్యమీవిధముగ నశించిపోవుటను చూచిన మహిషాసురుడు ఉగ్రమహోదగ్రుడై మహిషరూపము ధరించి, తనగిట్టల తాపులతో భూమిని కంపింపజేయుచు, కొమ్ములతో పర్వతముల నెగురజిమ్ముచు, ప్రళయ భీకరాకారముగ రంకెలు వేయుచు పరాశక్తినెదుర్కొనెను. అపుడాదేవి తన పాశమును ప్రయోగించి మహిషుని బంధించినది. తోడనేవాడు పలురకముల రూపములను ధరించుచు మాయాయుద్ధమొనర్చి, అంబిక ధాటికోర్వలేక తుదకు మరల మహిషమై ముల్లోకములను క్షోభిల్లజేసెను. అంతనాదేవి చండియై మహిషునిపైకురికి, వాని కంఠమును పాదముతో త్రొక్కిపట్టి, శూలముతో పొడువనారంభించినది. దేవీపాదము క్రింద చిక్కుకొని, ఆమె పరాక్రమమునకు లొంగిపోయిన అసురుడు తన మహిష ముఖములో నుండి సగము యదార్థ స్వరూపముతో నిక్కిబయల్పడెను. వెంటనే దేవి తన మహాఖడ్గముతో వాని శిరస్సును ఖండించివేసినది. రాక్షససైన్యమంతయు హాహాకారములు చేయుచు అక్కడనే పడి నశించెను. దేవతాగణములన్నియు మిక్కిలి సంతోషముతో ఉప్పొంగి ఆ దేవి నీవిధముగ స్తుతించెను.

తన శక్తిచే యీ జగత్తునందంతటను వ్యాపించి యుండునదియు, సర్వదేవగణముల శక్తిసమూహమూర్తి రూపమైనదియు, సర్వదేవతలచేతను,

మహర్షులచేతను ఆరాధింపదగినదియునగు అంబికకు మేము సభక్తికముగ ప్రణమిల్లుచున్నాము. ఆ దేవి మాకు శుభముల నిచ్చుగాక.

ఎవరి యసమాన బలప్రభావములను బ్రహ్మవిష్ణుమహేశ్వరులు వర్ణింపజాలరో, ఆ చండిక సర్వజగత్తును పరిపాలించుటయందును, అమంగళములవలన భీతిని నశింపజేయుటయందును తన మహిమ నుపయోగించుగాక.

పుణ్యపురుషుల గృహములందు సంపదగను, పాపాత్ముల యిండ్లయందు అశుభముగను, విద్వాంసుల హృదయములలో బుద్ధి (జ్ఞానము)గను, సత్పురుషుల హృదయములందు శ్రద్ధగను, సత్కులజుల హృదయములలో లజ్జగను, ఏదేవి స్వయముగ నిలిచి ఉండునో, ఆ దేవికి ప్రణమిల్లు చున్నాము. నీవు జగత్తును పరిపాలింతువుగాక!

దేవీ! తలచుటకునలవికాని (మనస్సునకు అందని) నీ రూపమును గాని, రాక్షసులను నశింపజేసే నీ వీర్యాతిశయమునుగాని, దేవాసురాది గణములయొక్క యుద్ధములన్నిటియందు నీవు చేయు అత్యద్భుతచర్యలుగాని, వర్ణించుట మాకెట్లు సాధ్యమగును?

సర్వజగత్తులకు నీవేకారణమవు? నీవు త్రిగుణాత్మకవయ్యును వాని యందలి దోషములు నీయందుకానరావు! హరిహరాదులు కూడ నిన్ను గ్రహించజాలరు! ఎల్లరకును నీవే అండవు! ఈ జగత్తంతయు నీలోనొక స్వల్పభాగము నుండి ఉత్పన్నమైనది. నిజముగ నీవు సర్వాధికయగు ఆద్యప్రకృతివి.

నీవు శబ్ద బ్రహ్మమునకు ఆత్మవు. అతి నిర్మలములగు ఋగ్యజుర్వేద-మంత్రములకును, ఉద్గాథ వలన శ్రవణపేయములగు సామవేదమంత్రములకును నీవు ఉనికి పట్టువు. నీవు వేదత్రయ స్వరూపిణియగు భగవతివి. నీవు సంసారజీవనోపాధివి.

ఈ స్తోత్రమందు పరాశక్తిని వైశ్యవృత్తియగు వ్యవసాయ రూపిణిగను, సమాజజీవనోపాయ రూపిణిగను స్తుతించుటచే పరాంబికకును, వైశ్యులకు గల గరిష్ఠ సంబంధము స్పష్టమగుచున్నది. నీవు సర్వలోక దుఃఖములను పోగొట్టు మహాశ్రేష్ఠురాలవు.

దేవీ, సర్వశాస్త్రముల సారమును తెలసికొను 'మేధవు' నీవు - దాటశక్యము కాని సంసారసాగరమును దాటించు అసమానమైన నౌకవగు దుర్గవు నీవు. విష్ణు హృదయ నివాసివగు శ్రీలక్ష్మివినీవు. శివుని యందు శాశ్వతమై నిలచిన గౌరివియు నీవే.

దేవీ, ప్రసన్నవుకమ్ము. నీవు సర్వాధికురాలవు. కినుకపూనినచో క్షణములో లోకకళ్యాణార్థము రాక్షసకులములను నశింపజేయుదువు. మహిషాసురుని అపారసైన్యములు సంహరింపబడినప్పుడే యీ విషయము తెలిసినది.

కష్ట సమయములదు దుర్గతిహారిణివైన దుర్గవగు, నిన్ను తలచుకొనువారి కెల్లరకును నీవు భయమును నివారింతువు. స్వస్థులై సుఖించువారు నిన్ను స్మరించినచో అంతకన్న శుభాధికమగు బుద్ధి నిత్తువు. దారిద్ర్యమును, కష్టములను, భయమును పోగొట్టు ఓదేవీ, ఎల్లరకును ఉపకారము చేయగల మృదుల హృదయము నీకు తప్ప మరి ఏ దేవతకు కలదు?

వైరులను వినాశమొనర్చి నీవే త్రిలోకములను రక్షించితివి. శత్రుగణములను యుద్ధభూమిలో వధించి వారినికూడా స్వర్గమునకు కొనిపోయినది. మదోన్మత్తులగు సురవైరులవలన భయమును తొలగించితివి. నీకు ప్రణామములు.

ముల్లోకములందు సంచరించుచుండు నీ సౌమ్య రూపములతోను, అత్యంత ఘోర రూపములతోను మమ్ములను భూలోకమును రక్షింపుము.

నిన్ను ఎప్పుడెప్పుడు స్మరింతుమో, అప్పుడప్పుడు మా మహాపదలను నివారించుచుండుము. మఱియు నిర్మలవదనముగల ఓ అంబికా, మానవుడు ఎన్నడైనను నిన్నీ స్తోత్రములతో స్తుతించినచో, మాయెడ ప్రసన్నమైనట్లే వానిని కూడా అనుగ్రహించి ధనధాన్యాది సంపదలు, అభ్యుదయము, విభవములు వానికి సర్వదా ప్రసాదించుచుండుము. ఓ కరుణామయీ! నీకివే మాప్రణామములు.

అని యిట్లు అత్యంత భక్తిశ్రద్ధలతో స్తుతించిన దేవతల ఋషుల పరభక్తికి మిక్కిలి ప్రసన్నురాలై వారికి కోరినవరములనిచ్చి ఆదిశక్తి అంతర్ధానురాలైనది అని సూతమౌని శౌనకాది ఋషులకు చెప్పిన మహిషాసురమర్ధని గాధను సాలంకాయన మహర్షి మణిగుప్తాది వైశ్యోత్తములకు తెలియజేసి యింకను యిట్లు చెప్పసాగెను.

### శుంభనిశంభుల ఉదంతము :-

మహిషాసురమర్ధని గాధను వినిపించిన సూతుడు శౌనకాది మునులతో మహర్షులారా! పరాంబిక కన్యారుపిణియై అవతరించి లోకకళ్యాణార్ధమై శుంభనిశుంభులను రాక్షసులను సంహరించిన పావనగాధను మీకిపుడు తెలియజేయుదును. వేదవ్యాస మహర్షి యీ కౌశికీ కన్యావతార ఘట్టమును మార్కండేయపురాణములోను, వాయుపురాణమునందును చక్కగ వివరించెను. ఆ అద్భుత చరిత్రను సావధానులై వినుడు అని శౌనకాదిమునులకు యీ విధముగ చెప్పసాగెను.

పూర్వము శుంభుడు నిశుంభుడను రాక్షసులు తమ బలగర్వముతో ఇంద్రుని త్రిలోకాధిపత్యమును, దేవతల హవిర్భాగములను హరించిరి. ఆయసురులచే తరుమగొట్టబడిన సురలు పరాజయమెఱుగని "అపరాజితా" దేవిని సంస్మరించిరి. వారు అనన్యభక్తియుక్తులై ఏకాగ్రచిత్తులై పరాంబికనిట్లు ప్రార్థించిరి. "మంగళస్వరూపమైన

ఓదేవీ! నీవు జగన్మూలశక్తివి, లోకరక్షకివి. సంకల్పశక్తి స్వరూపిణివి. జగదాధారమైన చిత్స్వరూపిణివి. అనంత బలసంపన్నవగు ఆదిశక్తివి. మదగర్వితులైన రక్కసులనుక్కడగించి మాయాపదల బాపుము." దేవతలీతీరున స్తోత్రము చేయుచుండగ, పరమేశ్వరి గంగాతీరమునకరుదెంచి వారిమొరల నాలకించినది. ఆమె శరీర కోశము నుండి శుభమూర్తియైన ఒక యవ్వనవతి బయల్వెడలినది. ఆ శుభమూర్తి "కౌశికి" యనియు, "కన్యక" యనియు కీర్తించబడినది. అటుపై ఆ జగదీశ్వరి హిమాచలమును నివాసముగ చేసికొని అటనుండిసాగినది. మధురమంజుల మనోహరరూపిణియై ప్రకాశించుచున్న ఆ కన్యకను శుంభనిశుంభుల భృత్యులైన చండముండులను రాక్షసులు చూచిరి. వారు వెంటనే పోయి తమ రాజైన శుంభునితో ఆ యపూర్వకన్యకా సౌందర్యరాశిని గూర్చి వర్ణించి చెప్పుచు "ఓ ప్రభూ! ముల్లోకములలోని శ్రేష్ఠ వస్తువులన్నియు యిపుడు నీవద్దనున్నవి. కుబేరుని పద్మనిధి, ప్రజాపతి రథరాజము, సముద్రునిలో గల సమస్త శ్రేష్ఠరత్న సంపద, అగ్నిదేవుని అద్భుత వస్త్రసంపద, మీ సోదరుల చెంతకు చేరియున్నవి. ఇపుడా హిమాలయములలో నున్న స్త్రీరత్నమును కూడా నీవేల తెచ్చుకొనరాదు?" అని పలువిధముల ప్రోత్సహించిరి. ఆ మాటలు విన్న శంభుడు, సుగ్రీవుడను రాక్షసుని దేవి యొద్దకు దూతగ పంపెను. సుగ్రీవరక్కసుడు ఆ కన్యకా సన్నిధికి పోయి ఆమెకు తన ప్రభువు యొక్క ధనబలపరాక్రమాదులను గూర్చి వర్ణించి చెప్పి, తన ప్రభువును వరించుమని నచ్చబలికెను. ఆ సుగ్రీవాసురుని పలుకులను వినిన అంబిక, లోలోన నవ్వుకొని, ఆ రాక్షసునితో "ఓయీ! నీవు చెప్పినదంతయు నిజమేకాని నేను పూర్వము అల్పబుద్ధినై ఒక ప్రతిజ్ఞ చేసితిని. నా ప్రతిజ్ఞ ననుసరించి, యుద్ధములో నన్ను జయించగలిగిన బలపరాక్రమశాలినే భర్తగా నేను స్వీకరించగలను. కనుక మహాసురులైన శంభుడుగాని, నిశంభుడు గాని యిక్కడ నన్ను ఓడించగల్గినచో నా పాణిగ్రహణ సౌభాగ్యమును పొందగలరు. నీవు వెళ్ళి యీ విషయము నీ రాజులతో విన్నవించుము." అని చిరునగవుతో పలికినది.

సుగ్రీవుడు వెంటనే పోయి ఆ కన్యావచనములను శుంభునకు వినిపించెను. అంత శుంభుడుగ్రుడై, ఆ కన్యను బలత్కారముగ పట్టి తెమ్మని ఆజ్ఞాపించి ధూమ్రలోచనుడను దైత్యాధిపతిని పంపించెను. ధూమ్రలోచనుడు అరువదివేల రాక్షస సైన్యముతో బయలుదేరి శీతాద్రిపై కూర్చొని యుండిన దేవిని చూచి "నీవు ప్రీతితో మా రాజుకడకు రాకున్నచో బలాత్కారముగ నీ జుట్టు పట్టియీడ్చుకొనిపోగలను." అని కేకలు వేయుచు, పరాంబికవైపునకు పరుగెత్తెను. అంతట ఆ అంబిక తన హుంకారగర్జన మాత్రంతోడనే అతనిని భస్మీపటలుని గావించినది. ఆమె వాహనమైన సింహము విజృంభించి అసురసైన్యమునంతటిని క్షణకాలములోనే అంతమొందించినది.

## భద్రకాళికావిర్భావము - చండముండాసురుల వధ :-

ధూమ్రలోచనుని మరణవార్తను విన్న శుంభుడు మండిపడి, చండముండులను మహారక్కసులను దేవిపైకి పంపించెను. వారు చతురంగబల సమేతులై పోయి హిమవన్నగ సువర్ణ శిఖరముపై సింహవాహినియై చిరుగనవులొలికించుచున్న దేవిని చూచి ఆమెను పట్టుకొన ప్రయత్నించిరి. అంతట యా దేవీ లలాటము నుండి కాళరాత్రివలెనున్న కాళికాశక్తి హఠాత్తుగ బయల్పడినది. ఆ కాళిక విచిత్రమైన మంచపు కోడును పుర్రెల బెత్తమును ధరించి, మెడలో మానవ కపాలమాలను, నడుమున వ్యాఘ్ర చర్మాంబరమును దాల్చి, అస్థిపంజరము వంటి శరీరముతో, మిక్కిలి విస్తారముగ తెరువబడిన నోటితో, భయంకరముగ వ్రేలాడుచున్ననాలుకతో, లోతైన చింతనిప్పుల వంటి ఎర్రని కన్నులతో, భీతావహరూపిణియై, దిక్కులు పిక్కటిల్లునట్లు పెడబొబ్బలు పెట్టుచు, శత్రుసైన్యము పైబడి ఆ రాక్షసులను తన ఆయుధములతో మర్దించుచు, ఖండించుచు కోర పండ్లతో నములుచు, క్షణకాలములోనే ఆ మహాసురుల సైన్యమును మట్టుబెట్టినది. అది చూచిన చండ ముండులు కాళికమీదకు రాగా ఆమె అంతులేనిరోషముతో వారి శిఖలను పట్టుకొని వారి శిరస్సులను ఛేదించి వేసినది. చండ ముండుల మస్తకములను చేతధరించి వికటాట్టహాసము చేయుచు చండిక యొద్దకు

చేరినది. చండ ముండుల తలలను గొనవచ్చినందువలన ఆ దేవి చాముండేశ్వరి అను ప్రసిద్ధనామముతో శోభిల్లినది.

చండముండాసురుల మరణవార్తను విన్న శుంభుడు ప్రచండ రోషముతో మహాసైన్య సమేతుడై తానే స్వయముగ దేవి నెదుర్కొనెను. వాని సైన్యము దేవిని నాలుగు దిక్కుల నుండియు చుట్టుముట్టినది. ఆ తరుణమున ముఖ్యదేవతల శక్తులైన సప్తమాతృకలు చండికా సన్నిధికి చేరిరి.

## సప్తమాతృకల యుద్ధము :-

బ్రహ్మశక్తియైన బ్రహ్మాణి అక్షమాలాకమండలములను ధరించి, హంసవిమానారూఢయై వచ్చినది. శివశక్తియైన మహేశ్వరి ఇందుశేఖరియై త్రిశూల, సర్పములను ధరించి వృషభవాహనరూఢయై అరుదెంచినది. కుమారశక్తియైన కౌమారి హస్తమున బల్లెమును బూని మయూరవాహనము నధిరోహించి వచ్చినది. విష్ణుశక్తియైన వైష్ణవి శంఖచక్రగదాఖడ్గధనువులను దాల్చి గరుడారూఢయై అచటికేతెంచినది. ఆదివరాహవతార శక్తియైన వారాహి అసురులతో యుద్ధము చేయవచ్చినది. నరసింహావతార శక్తియైన నారసింహి నక్షత్ర మండలములు డుల్లిపోవునట్లు జూలువిదుల్చుచు వచ్చినది. ఇంద్రుని శక్తియైన ఇంద్రాణి వజ్రాయుధమును చేబూని ఏనుగునెక్కివచ్చినది. అంతట చండికాదేవి శరీరమునుండి భీషణమైన ధ్వనిగావించుచు ఒక అద్భుత కన్యాశక్తి ఆవిర్భవించినది.

క్రోధావేశపూర్ణులైన క్రూరరాక్షసులకు, ఆదేవీ శక్తలకు మధ్య భయంకర సంగ్రామము చెలరేగినది. కాళిక, ఖట్వాంగముతో శత్రుమర్ధనము గావించనది. బ్రహ్మాణి తన కమండలమంత్రజలము చల్లి రాక్షసుల బలవీర్యములను హరించినది. వైష్ణవి చక్రముతోను, కౌమారి శక్త్యాయుధముతోను, మహేశ్వరి త్రిశూలముతోను, ఐంద్రి

వజ్రాయుధ ప్రయోగముతోను వేలాది దానవులను చీల్చిచెండాడిరి. వారాహి తన ముట్టెతోను, పెనుకోరలతోను శత్రువీరుల గుండెలను పగులగొట్టినది. నారసింహ తన గోళ్ళతో మహాసురులను చీల్చివేసినది. ఇట్లు మాతృకాగణముగావించిన చిత్రవిచిత్ర మహాయుద్ధములో అసురసైన్యము అంతమైపోసాగినది. అదిచూచిన రక్తబీజుడను మహాసురుడు క్రోధారుణనేత్రుడై దేవితో యుద్ధమునకు సిద్ధపడెను.

## రక్తబీజుని వధ :-

రక్తబీజుడు విశిష్ట ప్రభావముగల రాక్షసవీరుడు. వాని శరీరము నుండి ఒక్కనెత్తురు చుక్క నేలపై పడినప్పుడల్లావాని యంతటి మహారాక్షసుడొకడు భూమి నుండి ఆవిర్భవించినాడు. ఆ యుద్ధములో రక్తబీజుని నెత్తురు నుండి క్రొత్తగా పుట్టిన వందలాది రాక్షసులు కూడా మాతృకాగణముతో సమానముగ ఘోరశస్త్రములతో పోరుసాగించిరి. వాని తనువు నుండి రక్తము కారిన కొలది వేలాది రాక్షసులు పుట్టసాగిరి. అది చూచి దేవతలు భయపడిరి. తోడనే కౌశికీ కన్యక చాముండిని బిలచి రక్తబీజుని శరీరము నుండి కారునెత్తురును ఒక్క చుక్క కూడ నేలపైపడకుండా, విస్తారమైన నాలుకతో నాకివేయుచు వాని రక్తము నుండి ఉద్భవించిన రాక్షసులను త్వరత్వరగ మ్రింగివేయుమని ఆజ్ఞాపించినది. చాముండేశ్వరి రక్తబీజుని రక్తమును త్రాగివేయుచుండగ చండిక మాతృకాగణముతో గూడి ఆ రక్కసుని పై వివిధాయుధములను ప్రయోగించినది. దానితో రక్తబీజుడు అంతరించెను. దేవతలానందించిరి.

## శుంభనిశుంభుల మరణము :-

ఈ విధముగ తమ సైన్యములు, సైన్యాధిపతులు సంహరించబడుట చూచి శుంభనిశుంభులు ఆగ్రహావేశములతో ఉన్మత్తులైరి. వెంటనే నిశుంభుడు దేవి

నెదుర్కొనెను. వారిరువురి మధ్య చిత్ర విచిత్ర గతులతో ఘోరమైన పోరుసాగినది. తుదకు దేవి తన శూలాఘాతముతో నిశుంభుని వధించినది. మాతృగణము నిశుంభుని సైన్యములను మట్టుబెట్టినవి.

అంతట శుంభుడు సోదరుని మరణమునకు చింతించుచు దేవిని జూచి "నీవు పిరికిదానవు. పరులశక్తిపై ఆధారపడి పోరాడుచున్నావు." అని పరహసించెను. ఆ మాటలు విన్న దేవి "ఓరీ మూర్ఖుడా! ఈ లోకములో నేనొక్కతినే వున్నాను. ఈ దేవతలందరూ నా విభూతులే, నా కంటే వేరెవ్వరును లేరు చూడుము." అని పలుకుచుండగ బ్రహ్మాణి మొదలగు దేవతలందరును ఆ దేవీ శరీరములోనికి ప్రవేశించిరి. అపుడు దేవీ, శుంభులిరువురకును భయంకరమైన యుద్ధము కొనసాగినది. పలువిధ శస్త్రాస్త్ర ప్రయోగములతో జరిగిన ఆ భీషణరణమునకు జగత్తు కంపించినది. చండికాదేవి శుంభుని రథాయుధములను తుత్తునియలు గావించినది. అంతట శుంభుడా కాశమునకెగిరి యుద్ధము చేయనారంభించెను. దేవి కూడా గగనమున కెగసి నిరాధారయై వానితో పోరాడి, తన శూలాఘాతములో వానిని నేలగూల్చినది. ఆ దురాత్ముని మరణముతో ప్రపంచమునకు స్వస్థత చేకూరెను. ఇంద్రాది దేవతలందరు చండికను అనేక విధముల యిట్లు కీర్తించిరి.

"శరణుచొచ్చినవారి దుఃఖములను పోగొట్టు దేవీ! ప్రసన్న రాలవగుము. సర్వలోకమాతా! ప్రీతవగుము. విశ్వమును పరిపాలించు దేవీ, సుప్రీతవగుము. జగత్తును రక్షింపుము. చరాచర ప్రపంచ మంతటికిని నీవే పరిపాలకురాలవు.

జగన్మాతా! విద్యలన్నియు నీ వివిధాంశములు. అట్లే లోకమునందలి స్త్రీలందరును నీ వివిధకళలు కలిగియుందురు. తల్లీ! ఈ జగత్తునందంతటను నీవే నిండియున్నావు. స్తుతింపదగు సర్వవస్తువుల యొక్క ముఖ్యోక్తి మరియు గౌణోక్తి రూపవగు నిన్నెట్లు స్తుతించగలము.

సర్వభూతస్వరూపనివిగ, పరంజ్యోతియైన దేవిగ, భోగ మోక్షప్రదాయినివిగ, ప్రశంసింపబడిన నిన్ను ఏ మాటలు ఎంత శ్రేష్ఠములైనను వర్ణింపజాలవు.

సమస్త శుభములందును గల శుభస్వరూపిణి వైకోరదగు సర్వప్రయోజన ములను సిద్ధింపజేయు దేవివై, శరణమునిచ్చు తల్లివై, త్రినేత్రవై, గౌరవర్ణశోభితవై యుండు దేవీ! పరాశక్తీ! నీకు ప్రణామములు.

సర్వస్వరూపము గల దానవును, సర్వపరిపాలకురాలవును, సర్వశక్తి సంపన్నవును అగు ఓ దేవీ, దుర్గా! నీకు ప్రణామములు. ఓ దేవీ! భయముల నుండి మమ్ము రక్షింపుము.

నీవు తృప్తినొందితివేని వ్యాధుల నన్నిటిని పోగొట్టుదువు. కినుకబూనితి వేని, సర్వాభీష్టములను విఘ్నమొనర్తువు. నిన్నాశ్రయించిన నరులను ఆపదలంటవు. మరియు వారు ఇతరులకు కూడ ఆశ్రయ మీయగలుగుదురు.

ఓ అంబికా! నీవిప్పుడీ యుద్ధమునందు నీ రూపమును అనేక రూపములుగా నొనర్చి, ధర్మమార్గవిరోధులగు మహారాక్షసులను సంహరించిన విధముగ ఏ ఇతరదేవత చేయగలదు? ఎవ్వరును చేయలేరు.

"ఓ సర్వేశ్వరీ! ఇప్పటియట్లే నీవు ముల్లోకముల దుఃఖములన్నిటిని శమింపజేయవలెను. మా శత్రువులనందరను నశింపజేయవలెను."

అని ఇట్లు ప్రస్తుతించిన దేవతలను జూచి ఆ జగన్మాత "బిడ్డలారా! భవిష్యత్తులో ఒకప్పుడు నూరేండ్ల క్షామము కలుగును. అపుడు నేను అయోనిజగ అవతరించినా శరీరము నుండి మొలచు శాకములతో లోకములను పోషించి శాకంబరి అను పేర ప్రసిద్ధురాల నగుదును. దుర్గముడను రాక్షసుని వధించి "దుర్గాదేవి" యనుపేరును

పొందెదను. అటుపై అరుణుడను లోకకంటకుని సంహరించుటకై తుమ్మెదల రూపమును ధరించి "భ్రామరి" యనుపేర ప్రసిద్ధురాలనయ్యెదను. వైవస్వత మన్వంతరములో ఇరువది యెనిమిదవ మహాయుగమున ఇప్పటి శుంభనిశుంభులు వేరు రూపములతో జన్మించగలరు. అప్పుడు నేను నందగోపునియింట యశోదాగర్భము నుండి శ్రీకన్యగా జన్మించి "వింధ్యవాసినీదేవి" అను పేరు ధరించి వారిని సంహరించెదను. అటుపై కలియుగమున నేను అతిశాంతమైన రూపముతో అంతరించి ప్రేమ, శాంతి, సత్యము, అహింస, త్యాగము అను వానిని అమోఘములైన అస్త్రములు జేసికొని, భూమిమీద వ్యాపించి వున్నహింసను, అధర్మమును, దుష్టత్వమును రూపు మాపి ప్రపంచమునకు వినూతనమైన తరుణోపాయమును ప్రబోధించెదను. అపుడు నాకు "వాసవీకన్యక" అను సుప్రసిద్ధనామము కలుగును. ఈ విధముగ భువిలో ఎప్పుడెప్పుడు దుష్టాత్ములుద్భవించి ధర్మమునకు హానికలిగింతురో అప్పుడప్పుడు ధర్మరక్షణ గావించుటకై నేను అవతరించుచుందును. నా మహిత్వ గాధలను పఠించువారు, వినువారు సమస్త శుభములను బడయగలరు. మీ అభీష్టములన్నియు నా కృప వలన నెరవేరగలవు." అని పలికి ఆ చండికాదేవి అంతర్ధానమైనది. దేవతలందరు తమ తొల్లిటి అధికారములను పొంది సుఖజీవనులైరి.